సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 12 । జూలై । 2024



నిత్యాన్నదానానికి రూ.25 వేలు


అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గోదాశి నాగేశ్వర రావు (లంకాఫ్ ఠాణేలంక) గురువారం రూ.25 వేల విరాళం అందజేశారు.



రూ.3,00,116 విరాళాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఐ.రామ్మోహన్, రమాసుందరి (బెంగళూరు) రూ.2 లక్షలు, వై.రాధాకృష్ణ (హైదరాబాద్) రూ.1,00,116 విరాళాలు సమర్పించారు.

సముద్రంలోకి 72,313 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 72,313 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను గురువారం సాయంత్రం సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,800, సెంట్రల్ 1,900, పశ్చిమ డెల్టాకు 6,000 కలిపి మొత్తం 11,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఎకో టూరిజం అభివృద్ధికి సహకరించాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎకో టూరిజం అభివృద్ధికి కడియం నర్సరీల యాజమాన్యాలు సహకరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. నర్సరీల యాజమాన్యాలు, అసోసియేషన్ ప్రతినిధులతో తన చాంబర్‌లో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యాటకులను ఆకర్షించేలా కడియం నర్సరీల్లో ఎకో టూరిజం అభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళికలతో రావాలని కోరారు. ఇందులో భాగంగా ఒకే రకమైన తోటలను, వివిధ రకాల మొక్కలతో కూడిన నర్సరీలను వాకింగ్ ట్రాక్ ద్వారా అనుసంధానం చేయాలని సూచించారు. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేలా సదుపాయాలు కల్పించాలన్నారు. రిసార్ట్స్, ఫుడ్ కోర్టు, కాఫీ షాపు, పిల్లలకు క్రీడా సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వపరంగా విస్తృత ప్రచారం కల్పిస్తామని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పర్యాటక శాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ వి.స్వామినాయుడు, జిల్లా హార్టికల్చర్ అధికారి అడపా దుర్గేష్, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు బాలరాజు, నర్సరీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో డీఈఈ సెట్ రెండో విడత కౌన్సెలింగ్ గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా 18 మంది విద్యార్థులు హాజరై సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ తెలిపారు. అనంతరం వారికి ఫైనల్ అడ్మిషన్ లెటర్ అందజేశామన్నారు.

ఏడు ఇసుక లారీలు స్వాధీనం

నిడదవోలు: ఎటువంటి బిల్లులూ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు సీజ్ చేశారు. ఎస్ఈబీ జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు అధికారులు బుధవారం రాత్రి పెరవలి వద్ద జాతీయ రహదారిపై ఈ లారీలను పట్టుకున్నారు. రావులపాలెం మండలం గోపాలపురం నుంచి సుమారు 170 టన్నుల ఇసుకను ఏడు లారీలపై తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ లారీలను పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉంచి, జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

పాడి పశువుల మేపులో గ్రాసాలే కీలకం

జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు

అమలాపురం టౌన్: పాడి పశువుల మేపులో గ్రాసాలే కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు అన్నారు. స్థానిక నల్ల వంతెన వద్ద గల ఏరియా పశువుల ఆస్పత్రి వద్ద పశు గ్రాస వారోత్సవాల సందర్భంగా రైతులతో గురువారం జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ వెంకట్రావు మాట్లాడారు. అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ మేలైన పశు గ్రాసాల వల్ల పాడి పశువులకు బలవర్ధక ఆహారం అందుతుందన్నారు. 'మేపులోనే ఉంది చేపు' అనే నినాదాన్ని అనుసరించి పాడి పశువుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలంటే పశు గ్రాసాల వల్లే సాధ్యమవుతుందని సూచించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో గల మినీ పశు గ్రాస క్షేత్రంలోని వివిధ రకాల గ్రాసాలను రైతులకు చూపించి అవగాహన కల్పించారు. ఈ క్షేత్రంలోని సూపర్ నేపియర్, కో-3, కో-4, జనుము, జొన్న, అలసంద, పిల్లి పెసర వంటి ఏకవర్షిక, బహువచక పశు గ్రాసాలను ప్రదర్శించి గ్రాసాల వారీగా వాటి వల్ల పశువులకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. రైతులతో పాటు డెయిరీ సైన్స్ విద్యార్థులకు కూడా పశు గ్రాసాల రకాలను ఉపయోగించి పాల ఉత్పత్తి ఎంత మేర వృద్ధి చేసుకోగలమో అవగాహన కల్పించారు. పశు వైద్య సిబ్బంది వెంకటేష్, వాసవి, చంద్రశేఖర్, ప్రసాద్, రైతులు వాసంశెట్టి రామమోహన్, చోడిశెట్టి సత్తిబాబు, లింగోలు మణికంఠ పాల్గొన్నారు.

అరుణాచలానికి 19న స్పెషల్ బస్సు

కాకినాడ సిటీ: తమిళనాడులోని ప్రముఖ శైవ క్షేత్రం అరుణాచలానికి ఈ నెల 19న ప్రత్యేక బస్సు నడుపుతున్నామని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు కాకినాడలో 19వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరుతుంది. కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అరుణాచలం చేరుతుంది. అక్కడ గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఈ నెల 22వ తేదీ రాత్రి 10 గంటలకు తిరిగి కాకినాడ చేరుతుంది. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని మనోహర్ తెలిపారు. టికెట్టు ధర రూ.3,100గా నిర్ణయించామన్నారు. టికెట్ల బుకింగ్‌కు 73829 10869, 73829 10778 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తల్లికి ద్రోహం

- 'తల్లికి వందనం' హామీకి తిలోదకాలు!
- పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు ఇస్తానన్న చంద్రబాబు
- ఇప్పుడు ఒక్కో తల్లికి రూ.15 వేలు అంటూ జీఓ
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న తల్లులు



సాక్షి, రాజమహేంద్రవరం: ఏరు దాటాక తెప్ప తగలేయడంలో సీఎం చంద్రబాబుది అందె వేసిన చేయి. ఎన్నికల సమయంలో బూటకపు హామీలు గుప్పించడం.. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయకుండా, ప్రజలను వంచించడం ఆయన నైజం. 2014లో ఇదే తరహా పాలన సాగించడంతో ప్రజలు 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్న తలంపుతో షరా మామూలుగానే ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చేసి, ప్రజలను బుట్టలో వేసుకున్నారు. అంతా తాను అనుకున్నట్టే జరిగి, ఇప్పుడు అధికారం హస్తగతం కావడంతో.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారు. తాను ఇచ్చిందే తీసుకోవాలన్న చందంగా ప్రజలను దగా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ఇన్నాళ్లూ నాన్చుడు ధోరణి అవలంబించడమే కాకుండా.. ఇప్పుడు ఒక్కో తల్లికి రూ.15 వేల చొప్పున మాత్రమే ఇస్తామని జీఓ ఇచ్చారు. దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వంచించారిలా..

- సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారు. కుటుంబంలో బడికి వెళ్లే విద్యార్థులందరికీ ఏటా ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున 'తల్లికి వందనం' పేరుతో ఆర్థిక ఆసరా కల్పిస్తానని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్లేటు ఫిరాయించారు. తల్లికి వందనం మాట అటుంచితే తల్లికి ద్రోహం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. పథకం అమలుకు సవాలక్ష నిబంధనలు విధిస్తూ కోత విధించేందుకు శ్రీకారం చుట్టారు.
- పిల్లలందరికీ ఇస్తామని నాడు చెప్పగా, నేడు కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా ఒక్క తల్లికి మాత్రమే ఏటా రూ.15,000 చెల్లిస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం ఒక్క విద్యార్థికి మాత్రమే ప్రభుత్వం 'తల్లికి వందనం' ఆర్థిక సాయం అందించనుంది.
- ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులకు 75 శాతం హాజరు ఉండాలన్న నిబంధన పెట్టారు.
- అది కూడా అన్ని వర్గాలకూ కాకుండా దారిద్ర్య రేఖకు దిగువనున్న తల్లులకు మాత్రమే ఇస్తామంటూ మెలిక పెట్టారు. దీనిపై మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తామేం పాపం చేశామని ప్రశ్నిస్తున్నారు. తాము చదువుకోవాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందేనా అని ఆయా వర్గాల విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.
- పాఠశాలలు ప్రారంభమవడంతో ఈ పథకం ద్వారా ఎప్పుడు లబ్ధి చేకూరుతుందా, పిల్లల ఫీజులు ఎప్పుడు చెల్లిద్దామా అని ఎదురు చూస్తున్న వారు హతాశులవుతున్నారు. ఇప్పటి వరకూ ఎటువంటి ఆర్థిక సాయం అందకపోవడంతో ఫీజులు చెల్లించాల్సిన, నోట్ బుక్స్, ఇతర పుస్తకాలు కొనుగోలు చేయాల్సిన తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పిల్లల చదువులకు గతంలో మాదిరిగానే అప్పులు చేయాల్సి వస్తుందేమోనని కలత చెందుతున్నారు.

కోత పడనుందిలా..

- తాజా జీఓ ప్రకారం తల్లికి వందనం పథకం లబ్ధిదారుల్లో భారీగా కోత పడనుంది.
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 985 ప్రభుత్వ, 587 ప్రైవేటు కలిపి 1,572 పాఠశాలలున్నాయి.
- ప్రభుత్వ పాఠశాలల్లో 1,00,765 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 1,52,813 మంది విద్యార్థులు ఉన్నారు.
- ఎన్నికల వేళ చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం 'తల్లికి వందనం' పథకాన్ని 2,53,578 మంది విద్యార్థులకు అమలు చేయాల్సి ఉంది.
- కానీ ఇప్పుడు ఒక్కరికే అనే నిబంధన పెట్టడంతో గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మాదిరిగానే 1.62 లక్షల మందికి మాత్రమే చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకం అమలు చేయనుంది.
- ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో 37,572 మంది విద్యార్థులున్నారు. వీందరికీ కూడా ఈ పథకం వర్తింపజేయాల్సి ఉంది.

గతంలో 'అమ్మ ఒడి' కింద ఏటా రూ.243 కోట్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన విషయం తెలిసిందే. కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా సకాలంలో తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసేవారు. దీనికి తోడు జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలు, జగనన్న విద్యా కానుక, విదేశీ విద్యా దీవెన తదితర అనేక పథకాలు క్యాలెండర్ ప్రకారం అమలు చేసేవారు. పాఠశాలలు తెరిచే సమయానికే ఒక్క అమ్మ ఒడి పథకం ద్వారానే జిల్లా వ్యాప్తంగా ఏటా 1,62,000 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.243 కోట్లు జమ చేసేవారు. అంతే కాకుండా విద్యా దీవెన పథకంలో 34,764 మంది ఇంటర్ విద్యార్థులకు ఏటా రూ.32.74 కోట్లు అందజేశారు. జగనన్న వసతి దీవెన కింద 34,261 మంది విద్యార్థులకు రూ.32.61 కోట్లు అందించారు. ఇటువంటి పథకాలను పక్కాగా అమలు చేయడంతో తల్లిదండ్రులపై పిల్లల చదువుల భారం పెద్దగా పడేది కాదు.

నాడు స్కూళ్లు తెరవక ముందే..



మా ఇద్దరు పిల్లలు మిర్తిపాడు జెడ్పీ హైస్కూల్లో 9, 8 తరగతులు చదువుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా స్కూలు తెరవక ముందే అమ్మ ఒడి పథకం నగదు మా బ్యాంకు ఖాతాలో పడేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పథకం పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామన్నారు. కూటమి మాటలు నమ్మి ఇద్దరు పిల్లలు స్కూల్‌కు పంపిస్తున్నా. ఇంత వరకూ నగదు వేయలేదు.

– కోమటి నాగమణి, మిర్తిపాడు, సీతానగరం మండలం

ఒక్కరికే ఇస్తారంటున్నారు



కూటమి అధికారంలోకి వచ్చిన తక్షణమే చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని అన్నారు. మా పిల్లలు మిర్తిపాడు స్కూల్లో 7, 5 తరగతులు చదువుతున్నారు. వారికి సంబంధించి ఇంత వరకూ నగదు వేయలేదు. అసలు ఇస్తారో లేదో తెలియడం లేదు. ఎన్నికల్లో ఎంతమంది ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకంలో నగదు ఇస్తామని నమ్మించారు. ఇప్పుడు ఒక్కరికి మాత్రమే ఇస్తారని తెలిసింది.

– బత్తిన మహాలక్ష్మి, మిర్తిపాడు, సీతానగరం మండలం

అందరికీ వర్తింపజేయాలి



మా అబ్బాయి ప్రైవేటు స్కూల్లో చదువుతున్నాడు. పేద పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించే లక్ష్యంతో గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని అందరికీ అమలు చేసింది. కానీ చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకాన్ని అందరికీ వర్తింపజేస్తానన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో గెలిచిన తర్వాత మాట మారుస్తున్నారు. ఇది తగదు. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ తల్లికి వందనం డబ్బులు ఇవ్వాలి.

– అరుగొల్లు దీప్తి, బూరుగుపూడి, కోరుకొండ మండలం

పెళ్లికి ముందు.. కళ్లకు విందు!

- ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు పెరుగుతున్న ఆదరణ
- ఖర్చుకు వెనుకాడని జంటలు
- ప్రత్యేక స్టూడియోల ఏర్పాటు



రాయవరం: పెళ్లంటే నూరేళ్ల పంట.. జీవితంలో అదో మధుర ఘట్టం. వైవాహిక బంధంతో ఒక్కటయ్యే జంట మధుర స్మృతులను పది కాలాల పాటు దాచుకునేందుకు ఫొటోలు, వీడియోలు తీయించుకోవడం సాధారణం.. అయితే ఇటీవలి కాలంలో పెళ్లి వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఈ విషయంలో ఇప్పుడు ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. ప్రధానంగా ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రాధాన్యమిస్తున్నారు. మధుర స్మృతుల కోసం రకరకాల పద్ధతుల్లో ప్రీ వెడ్డింగ్ షూట్లు నిర్వహిస్తున్నారు. పెళ్లి వేడుకలో వాటిని స్క్రీన్‌లపై ప్రదర్శిస్తూ ఆహూతులకు ఆనందాన్ని పంచుతున్నారు.

ప్రాజెక్టులు, పంట చేలు

ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌ల కోసం ప్రాజెక్టులు, అటవీ ప్రాంతాలు, పొలంగట్లు, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, జలపాతాలు ఇలా దేన్నీ వదలడం లేదు. ఫొటోగ్రాఫర్లు దూర ప్రాంతాలకూ తీసుకువెళ్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని రంపచోడవరం, మారేడుమిల్లి, కోరంగి, దిండి, రాజమహేంద్రవరం, కాకినాడ, కాకినాడ బీచ్ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. రహదారుల వెంట, కొండ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలలోనూ ప్రీ వెడ్డింగ్ షూట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటుగా పలువురు వారి ఆర్థిక స్థాయికి అనుగుణంగా అరకు, ఊటీ, గోవా, సిమ్లా, వైజాగ్, బెంగళూరుతోపాటు హైదరాబాద్‌లోని రిసార్ట్స్, కేరళలోని పలు ప్రాంతాలనూ చుట్టి వస్తున్నారు.

అందమైన లొకేషన్లలో..

ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌లకు రూ.40 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. సాధారణ కుటుంబాలకు చెందినవారు స్థానికంగా తక్కువ ధరలో రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు ఎంతైనా ఖర్చు చేయడానికి వెనకాడడం లేదు. ఫొటో, వీడియో షూటింగ్ కోసం రకరకాల కాస్ట్యూమ్స్ వినియోగిస్తున్నారు. చాలావరకు ఎవరివి వారే తెచ్చుకుంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని గోల్కొండ కోట, బెలుం గుహలు, అరకు వేలి, రుషికొండ, వరంగల్ ఫోర్ట్, అనంతగిరి కొండలు, తలకోన వాటర్ ఫాల్స్ తదితర ప్రాంతాలకు ప్రీ వెడ్డింగ్ షూట్స్ కోసం వెళ్తుండగా, మరికొంత మంది గోవా, సిమ్లా, కశ్మీర్, కులుమనాలి తదితర ప్రాంతాలలో అందమైన లొకేషన్లు ఉండడంతో ఫొటో షూట్ కోసం చాలామంది ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని వెళ్తున్నారు.




ప్రీ వెడ్డింగ్ షూట్ ఫొటో

మారుతున్న ట్రెండ్

ఒకప్పుడు నిశ్చితార్థం, పెళ్లి, రిసెప్షన్లకు సంబంధించి ఫొటోలు, వీడియోలను తీయించుకుని ఆల్బంలు తయారు చేయించి జ్ఞాపకాలుగా భద్రపరచుకునేవారు. ఇప్పుడు ప్రీ వెడ్డింగ్ షూట్లు వచ్చాయి. పెళ్లికి ముందే వధూవరులు రకరకాల దుస్తులు ధరించి సినిమాలను తలపించేలా ఫొటోలు, వీడియోలు తీయించుకునేందుకు ఇష్టపడుతున్నారు. తమ స్థాయికి తగ్గట్టుగా ప్రీ వెడ్డింగ్ షూట్ కోసం ఫొటో, వీడియోగ్రాఫర్లను మాట్లాడుకుంటున్నారు, ఇండోర్, ఔట్ డోర్ షూటింగులకు వెళ్తున్నారు. కొత్త ట్రెండ్‌కు తగ్గట్టుగా ఫొటో, వీడియోగ్రాఫర్లు ఖరీదైన కెమెరాలను వాడుతున్నారు. షూట్‌ల కోసం స్టూడియోలు సైతం వెలుస్తున్నాయి.


ఆసక్తి పెరిగింది



గతంలో పెద్ద పెద్ద పట్టణాల్లో ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌లు చేయించుకునేవారు. ఇప్పుడు మారుమూల గ్రామాలకూ ఇది విస్తరించింది. పెళ్లి ఫొటోలు, వీడియోలతోపాటు ప్రీ వెడ్డింగ్ గురించి అడుగుతున్నారు. వారి ఆర్థిక స్థాయికి తగ్గట్టుగా ప్రీ వెడ్డింగ్ షూట్ మాట్లాడుకుంటున్నారు.

– కదలి పుష్ప కృష్ణ, ఫొటోగ్రాఫర్, మలికిపురం

ట్రెండ్ ఫాలో అవుతున్నారు



ప్రజలు ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. వాళ్ల అభిరుచులకు అనుగుణంగా ఫొటోలు, వీడియోలు తీస్తున్నాం. ఎక్కడికి వెళ్తే ఫొటోలు ఎలా వస్తాయో వారికి చూపిస్తాం. ప్రస్తుతం దాదాపు అందరూ ప్రీ వెడ్డింగ్ షూట్ ప్లాన్ చేసుకుంటున్నారు.

– కారంపూడి సత్తిబాబు, స్టూడియో యజమాని, రాయవరం

జీవితాంతం మధుర స్మృతులుగా..



పుట్టినరోజు, రజస్వల వేడుక, వివాహం, షష్టి పూర్తి, ప్రీ, పోస్ట్ వెడ్డింగ్ షూట్‌ల కోసం ప్రత్యేక స్టూడియోలు వెలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం, కాకినాడ, మండపేట, రాజానగరం, అమలాపురం, రాజోలు తదితర ప్రాంతాల్లో స్టూడియోలు ఏర్పాటు చేశారు. నాలుగు గంటలకు రూ.14వేలు తీసుకుంటున్నారు. ఆయా సందర్భాలకు అనుగుణంగా దుస్తులు ధరించి మనసుకు నచ్చినట్టు షూట్ చేయించుకునే అవకాశం ఉంది. ప్రీ వెడ్డింగ్ షూట్‌తో పాటు పెళ్లిలో తీసుకునే ఫొటోలు, వీడియోలు జీవితాంతం మధురస్మృతులుగా ఉంటాయి. ప్రీ వెడ్డింగ్ షూట్ కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాం.

– పి.చంద్రశేఖర్, అనితాదేవి దంపతులు, దంగేరు, కె.గంగవరం మండలం

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం



సమావేశంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను, రాజమహేంద్రవరం నగరాన్ని అగ్రగామిగా నిలుపుదామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులతో అధికారుల పరిచయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల సమస్యలు, పెండింగ్ పనులు, తాగునీటి వ్యవస్థ, ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ, వైద్య, ఆరోగ్య సేవలు తదితర అంశాలపై నియోజకవర్గాల వారీగా వివరించారు. వాటిపై సంబంధిత అధికారులు వివరణలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, ఆయా సమస్యల పరిష్కారానికి నివేదిక, సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను ప్రజలకు అందజేయడంలో ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, అన్నప్రాశన రోజే ఆవకాయ పచ్చడి అనే విధానం కాకుండా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధిగమించి, హామీలు అమలు చేస్తామని చెప్పారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, రాజమహేంద్రవరం అభివృద్ధికి, నగర ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 2027 గోదావరి పుష్కరాలు చక్కని అవకాశమని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చొరవ తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ఎన్నికల అనంతరం నాయకులందరూ ప్రజా సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి పని చేయాలని, అధికారులు నిబంధనలు అతిక్రమించకుండా ఉంటే సమస్యలు ఉత్పన్నం కావని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, ఎస్పీ పి.జగదీష్, ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో బియ్యం, కందిపప్పు స్టాల్ ప్రారంభం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన స్థానిక క్వారీ సెంటర్ రైతు బజారులో కందిపప్పు, బియ్యం స్టాల్స్‌ను ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్‌తో కలిసి మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరలు నియంత్రణలోకి వచ్చేంత వరకూ బియ్యం ,కందిపప్పును రైతుబజార్ల ద్వారా విక్రయిస్తామని చెప్పారు. ఒక్కో వినియోగదారుకు ఆధార్ కార్డుపై కేజీ కందిపప్పు రూ.160కి, కేజీ బియ్యం రూ.48కి విక్రయిస్తామని కలెక్టర్ తెలిపారు. రైతుబజార్లలో విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్, జిల్లా అగ్రి ట్రేడింగ్, మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్, అర్బన్ తహసీల్దార్ ఆంజనేయులు, ఏఎస్ఓ నాగాంజనేయులు, అర్బన్ ఎంఎస్ఓ ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నలుగురికి గాయాలు

గండేపల్లి: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఐదుగురు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు సూరంపాలెం గ్రామానికి చెందిన కడియాల మణికంఠ (22), ఇజ్జాపురెడ్డి సత్యనారాయణ, కందుల ఠాగూర్, అరవపల్లి శ్రీనివాస్, దొడ్డిపట్ల శ్రీను కలిసి శ్రీను కారులో బుధవారం రాత్రి పెద్దాపురం వెళ్లి తిరిగి వస్తుండగా కె.సూరంపాలెం గ్రామ శివారుకు వచ్చే సరికి కారు నడుపుతున్న దొడ్డిపట్ల శ్రీను డివైడర్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మణికంఠ మృతిచెందగా మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. మృతుని సోదరుడు కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

రాజానగరం: రాజానగరం – అనపర్తి రోడ్డులో ఫరిజల్లిపేటకు సమీపంలోని చాగల్నాడు కాలువ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో లారీ ఢీ కొని ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తోకాడకు చెందిన నల్లమిల్లి సందీప్ (20), అతని మిత్రుడు గండి వీరవెంకటసత్యనారాయణతో కలిసి బైకుపై రాజానగరం వచ్చి, తిరిగి వెళ్తున్న సమయంలో చాగల్నాడు కాలువ వద్ద ఉన్న రోడ్డు మలుపులో ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ వారి బైకును ఢీ కొనడంతో సందీప్ కింద పడిపోయాడు. అతనిపై నుంచి లారీ దూసుకుపోవడంతో శరీరంలోని భాగాలు కూడా బయటకు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో ఉన్న మిత్రుడు సత్యనారాయణకు తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం స్థానిక జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసును రాజానగరం ఎస్సై పవన్ దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాల గాలింపు



ఆర్ఆర్బీ చెరువులో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

పిఠాపురం: చెరువులో గల్లంతైనట్టు అనుమానిస్తున్న వ్యక్తి ఆచూకీ కోసం గురువారం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయి. గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన రైతు తట్టవర్తి వేమనదొర స్థానిక ఆర్ఆర్బీ చెరువులో గల్లంతు అయినట్లు ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఆదివారం సాయంత్రం చెరువులో గేదెలను కడగడానికి తోలుకొని వెళ్లాడు. పని పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఒక గేదె కనిపించకపోవడంతో ఇంటికి వచ్చి పోయిన గేదెను వెదకడానికి మళ్లీ వెనక్కి వెళ్లాడు. తర్వాత ఎంతకూ తిరిగి రాకపోవడంతో అతని బంధువులు పరిసరాల్లో గాలించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో చెరువులో దిగి గల్లంతై ఉంటాడని అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే నాలుగు రోజులు అయినా గల్లంతైన వ్యక్తి ఆచూకీ తెలియక పోవడంతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయి. చెరువు అంతా గాలించినా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో తిరిగి శుక్రవారం గాలింపు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

కూరగాయల సాగుకు తరుణమిదే..

- పందిరి సాగు మరింత ఆశాజనకం
- రాయితీపై విత్తనాల సరఫరా

అలమూరు: నైరుతి రుతు పవనాల ప్రభావం వల్ల విపరీతంగా వర్షాల కురుస్తున్నందున లంక భూముల్లో పందిరి కూరగాయల సాగుకు సరియైన సమయమిది. వేడి వాతావరణాన్ని తట్టుకోవడంతో పాటు నీటిని నిలుపుకునే లంక మట్టి నేలలు ఈ పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఉద్యాన శాఖ సూచనలకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు. అసలు ఈ సమయంలో ఏయే పంటలు సాగు చేయవచ్చు, విత్తనాల కొనుగోలు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకూ పందిరి కూరగాయలైన సోర, బీర, ఆనప, కాకర, పొట్ల, దోస, గుమ్మడి, బూడిద గుమ్మడితో పాటు వంగ, బెండ, టమాటా తదితర రకాలను సాగు చేసి అధిక దిగుబడులను సాధించవచ్చు. అన్ని సీజన్లలో వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకునే దొండ సాగును ఏడాది పొడవునా సాగు చేసుకునే అవకాశం ఉంది. ఆనప, బీర, పొట్ల, కాకర పంటను పందిరిపై పెంచితే మంచి నాణ్యత కలిగిన దిగుబడి వచ్చి అధిక లాభాలను పొందే అవకాశం ఉంటుంది. మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, కర్ర పెండలం, డెల్టా ప్రాంతంలో వాణిజ్య పంటలకు అనుకూలంగా ఉంటుంది.

విత్తనాల రాయితీ నేరుగా రైతు ఖాతాకు జమ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 3.75 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తుండగా కేవలం 35 వేల ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేస్తున్నట్టు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ మేలైన విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తోంది. కూరగాయల రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదుతో పాటు కూరగాయల సాగు చేస్తున్న భూమి వివరాలతో కూడిన దరఖాస్తులను గ్రామ ఉద్యాన శాఖ అసిస్టెంట్ల ద్వారా జిల్లా కార్యాలయాలకు పంపించాలి. దీంతో సంబంధిత జిల్లా కార్యాలయాలైన కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం కేంద్రాల్లో డీహెచ్ఓలు పరిశీలిస్తారు. అనంతరం విత్తనాల రాయితీ సొమ్ము నేరుగా రైతు ఖాతాలోకే జమ చేస్తారు. ఉద్యానశాఖ కార్యాలయాల్లో ఈ విత్తనాలు అందుబాటులో ఉంటాయి. వంగ, క్యాబేజీ, కాలీఫ్లవర్ నారును ఉద్యానశాఖ సూచనలకనుగుణంగా రైతులే తయారు చేసుకుంటే పెట్టుబడి ఆదా అవుతుంది. కూరగాయ విత్తనాలు అవసరమైన రైతులు పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో సంబంధిత ఉద్యానశాఖ అధికారి వద్దకు వెళితే రాయితీపై నాణ్యమైన విత్తనాలను పొందవచ్చు.



బడుగువానిలంకలో వంకాయలు కోస్తున్న రైతులు

తెగుళ్లు –సస్యరక్షణ చర్యలు

గుమ్మడి పెండు పురుగు

ఈ తెగులు మొక్క మొలిచిన వెంటనే సోకి ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. నివారణకు రెండు శాతం పాలిడాల్ పొడిని వారంలో రెండుసార్లు చల్లాలి. వీటి ప్రభావం ఎక్కువగా ఉంటే లీటర్ నీటికి ప్రొఫినోఫాస్ రెండు మి.లీ లేదా మలాథియాన్ రెండు మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పొట్లాకు పురుగులు

ఇవి మొక్కల పెరుగుదల, పూత దశల్లో ఆకులను ఎక్కువగా కొరికివేస్తాయి. నివారణకు క్లోరోఫైరిపాస్ 2 మి.లీ లేదా ఒక గ్రాము థయోడీకార్బ్‌ను లీటర్ నీటికి కలిపి పూతకు ముందు పిచికారీ చేయాలి.

పాడి-పంట

పండు ఈగ

పండు ఈగసోకి పంటలో కోతకు వచ్చే కాయలను ధ్వంసం చేయడంతో పాటు కాయ లోపలి భాగం కుళ్లి నాణ్యత తగ్గుతుంది. దీనికి ఒక మి.లీ మలాథియాన లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నివారణకు 10 లీటర్ల నీటికి 100 మి.లీ మలాథియాన్ 100 గ్రాముల బెల్లం, 250 మి.లీ బాగా పులిసిన కల్లును మట్టి మూకుళ్లల్లో పోసి పొలంలో అక్కడక్కడా పెట్టాలి.

బూజు తెగులు

నివారణకు లీటర్ నీటికి మాంకోజబ్ 2.5 గ్రాముల మందును కలిపి పిచికారీ చేయాలి. తెగులు తీవ్ర దశలో ఉంటే రెడోమిల్ ఎం.జడ్ ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

విత్తే ముందు జాగ్రత్తలు

కూరగాయల సాగుకు తొలుత విత్తన శుద్ధి తప్పనిసరి. కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్, ఐదు గ్రాముల ఇమిడా క్రోఫిన్ మందును ఒక దాని తరువాత మరొకటి కలిపి విత్తన శుద్ధి చేస్తే కూరగాయ మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి వస్తుంది. విత్తే ముందు ఎకరానికి ఆరు టన్నుల పశువుల ఎరువు, 35 కిలోల భాస్వరం, 18 కిలోల పొటాష్ మిశ్రమాన్ని విత్తన గుంటల్లో వేయాలి. విత్తిన 25–30 రోజుల్లో లేదా పిందె దశలో సుమారు 30 కిలోల నత్రజనిని రెండు సమపాళ్లుగా చేసి మొక్కలకు అందించాలి. కూరగాయల సాగు చేయాలని నిశ్చయించుకుంటే వేసవిలోనే దుక్కి దున్ని ఉంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కలుపు మొక్కలు లేకుండా ఉద్యాన రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

బూడిద తెగులు

నివారణకు లీటరు నీటికి ఒక మి.లీ కెరాథేన్‌లేదా ఒక గ్రాము డైనోకాప్ కలిపి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగు

ఈ తెగులు సోకడం వల్ల ఆకుల్లోని పత్రహరితం దెబ్బతిని ఆకుముడతలు ఏర్పడుతాయి. వీటి నివారణకు 1.5 గ్రాముల ఎస్పేట్, పిప్రోనిల్ రెండు మి.లీ ఇమిడాకోప్రిడ్ మందును ఒక మి.లీ నీటికి వినియోగించాలి.

పాము పొడ పురుగు

ఈ పురుగు కారణంగా చెట్టు బలహీన పడుతుంది. వీటికి ఒక గ్రాము అబామెక్టిన్‌మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

ఈ తెగులు సోకడం వల్ల కాయ, ఆకులు, పసుపు పచ్చ రంగులోకి మారి పూర్తిగా దెబ్బతింటాయి.

దీనికి లీటరు నీటిలో క్లోరోఫైరిపాస్ రెండు మి.లీ., వేపనూనె ఐదు మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

ఆకుపచ్చ తెగులు

ఈ తెగులును వేరుకుళ్లు తెగులు లేదా ఎండు తెగులు అని అంటారు. దీని ప్రభావం వల్ల తీగలు వాడిపోయి ఆకులు ఎండి రాలిపోతాయి. నివారణకు బోర్డో మిశ్రమం ఒక శాతం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను మూడు గ్రాముల మందును లీటరు నీటిని కలిపి మొక్కల మొదళ్ల దగ్గర తడిచేటట్టు పది రోజుల వ్యవధిలో రెండు లేదా మూడుసార్లు పోయాలి. ముందు జాగ్రత్తగా దుక్కిలో ఎకరాకు 250 కిలోల వేపపిండిని వేసి బాగా కలియదున్నాలి. పంట వేసిన తర్వాత ట్రైకోడెర్మా విరిడే కల్చర్‌ను పశువుల ఎరువులో కలిపి మొక్కల పాదుల దగ్గర వేయాలి.

సాగులో జాగ్రత్తలు పాటిస్తే అధిక లాభాలు



తీగజాతి కూరగాయల సాగు చాలా తేలిక. ఖర్చు తక్కువే. ఇవి ఎగబాకడానికి వెదురు కర్రలతో పందిర్లు వేసి వాటిపైకి ఎక్కేందుకు తాళ్లను కట్టాలి. పందిరి వేస్తే కాసిన కాయలు కిందకు వేలాడతాయి. ఇలా వేలాడిన వాటిని తెంపడం సులభం. ఇలా పండించిన కూరగాయలు నాణ్యతగా ఉండడంతో మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం సరైన సమయమైనందున తీగజాతి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి.

– డీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అమలాపురం



మూలస్థాన అగ్రహారంలో పందిరి దొండ సాగు



పందిరి కాకర తోట



ఏపుగా పెరిగిన పచ్చి మిరప



టమాట తోట

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తుల అరెస్ట్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలోని అరుంధతీపేటలో ఈ నెల 5న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి దిమ్మె నుంచి నేలకు కూల్చిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ గురువారం విలేకరులకు తెలిపారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ సేవా సమితి ఇచ్చిన ఫిర్యాదుపై ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అడిషనల్ ఎస్పీ ఎస్కే ఖాదర్‌బాషా పర్యవేక్షణలో తాను, రామచంద్రపురం సీఐ పి.దొరబాబు, సర్కిల్ ఎస్సైలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు నిర్వహించామన్నారు. ఈ నెల 10న ఈ నేరానికి పాల్పడిన వారిని, వారు పారిపోవడానికి సహకరించిన వ్యక్తితో కలసి అరెస్ట్ చేశామన్నారు. సంఘటన జరిగిన రోజున ముద్దాయిలు మద్యం సేవించి ఈ విగ్రహాలను ధ్వంసం చేశారు. అర్ధరాత్రి సమయంలో ఒక జువెనల్, యర్రంశెట్టి త్రిమూర్తులు అలియాస్ తరుణ్, చిక్కాల వీరమణికంఠ అలియాస్ మణి, వేపూరి వీరవెంకట సత్యనారాయణ అలియాస్ నాని, ఈత రామచంద్రుడు అలియాస్ రాము అలియాస్ చిన్ను గునపంతో విగ్రహాన్ని ధ్వంసం చేసి నేల కూల్చారు. విగ్రహం పడినప్పుడు శబ్దం రావడంతో ఎవరైనా వస్తారేమోనని పారిపోయారు. ఆ సమయంలో వారికి ఎవరైనా వస్తున్నారా లేదా అనే సమాచారం ఇవ్వడం, తప్పించుకోవడానికి సహకరించిన వ్యక్తిగా శిరిగినీడి దుర్గాప్రసాద్ అలియాస్ డీపీని గుర్తించామన్నారు. అదే విధంగా ముద్దాయిలు నేరం అంగీకరించారన్నారు. వీరిని గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ఎస్సైలు జి.సురేంద్ర, జానీబాషా, సురేష్‌బాబు, చైతన్య, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.



రామచంద్రపురంలో ముద్దాయిలను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామకృష్ణ

ఇంట్లో దాక్కొని ఉత్కంఠ రేపిన బుడ్డోడు

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో పోలీసుల సమక్షంలో తండ్రి భుజంపై ఉన్న ఎనిమిదేళ్ల బాలుడి పేరు పిల్లి సాయి షణ్ముఖ్. ఇంద్రపాలెంలోని ప్రైవేట్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. స్కూల్ ఎగ్గొటేందుకు మూడు గంటల పాటు ఎవరికీ కనిపించకుండా ఇంట్లో నక్కి అందరికీ చెమటలు పెట్టించాడు. వివరాల్లోకి వెళితే.. బాలుడి సొంతూరు కాకినాడ రూరల్ తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని కొత్తూరు వద్ద బర్మాకాలనీ. రెండో తరగతి వరకు అక్కడ చదివాడు. షణ్ముఖ్ తల్లి రెండో కాన్పులో పాపకు జన్మనిచ్చి వారం రోజుల్లో చనిపోవడంతో ఇద్దరి పిల్లల పెంపకం బాధ్యతను ఇంద్రపాలెంలోని పెద్దమ్మ పితాని వరలక్ష్మి చేపట్టింది. తన పిల్లలతో పాటు షణ్ముఖ్‌ను ఇంద్రపాలెంలో 3వ తరగతిలో చేర్పించింది. గురువారం ఉదయం స్కూల్‌కు పంపేందుకు స్నానం చేసిన తరువాత టవల్‌తో ఉన్న షణ్ముక్ మాయమయ్యాడు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో కంగారు పడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంద్రపాలెం ఎస్సై మణికుమార్, సిబ్బంది బాలుడిని వెతికే పనిలో పడ్డారు. అందరిలో టెన్షన్, మరో వైపు కిడ్నాప్ జరిగిందా అని భయం. ఇదీలా ఉండగా బాలుడి తండ్రి నాగేశ్వరరావుకు కబురు పెట్టడంతో వెంటనే అక్కడకు చేరకున్న అతను, తన బిడ్డకు దాక్కునే అలవాటు ఉందని చెప్పడంతో ఇంట్లో మరోమారు వెతకగా కుట్టుమెషీన్‌ను కాలితో తొక్కేందుకు వినియోగించే పాదంపై నక్కి దాక్కున్నాడు. సుమారు మూడు గంటల టెన్షనకు తెరపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఇంద్రపాలెంలో పాఠశాల ఎగ్గొట్టేందుకు ఇంట్లో నక్కి టెన్షన్ పెట్టిన బాలుడు సాయి షణ్ముఖ్‌తో ఇంద్రపాలెం ఎస్సై మణికుమార్ తదితరులు

గోదావరిలో దూకిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్

కొవ్వూరు: అనారోగ్యం కారణంగా 25 రోజుల నుంచి నిద్రపట్టడం లేదని జీవితంపై విరక్తి కలిగి చేబ్రోలు వెంకటరమణమూర్తి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం రాత్రి గామన్ బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకాడు. రాత్రిపూట గస్తీ తిరుగుతున్న బీట్ కానిస్టేబుల్ గుర్తించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక కానిస్టేబుల్ ప్రకాష్ సాహసోపేతంగా రెస్కీ బోట్ ద్వారా సిబ్బంది సహకారంతో రమణమూర్తిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన వెంకటరమణమూర్తి అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఈ ఘాతుకానికి పాల్పడినట్టు అగ్నిమాపక అధికారి ఏవీఎస్ఎస్ వేణు తెలిపారు. సాహసోపేతంగా నదిలో దూకి వ్యక్తి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ ప్రకాష్‌ను ఆయన అభినందించారు. రమణమూర్తిని వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కూలి డబ్బు చెల్లించని కూటమి ప్రభుత్వం

స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తరలింపు నిలిపివేత

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం ఇసుక స్టాక్ పాయింట్లలో గురువారం ఇసుక సరఫరా నిలిచిపోయింది. రెండు రోజులుగా ఇసుక లోడింగ్ పనిలో శ్రమిస్తున్న జట్టు కూలీలకు కూలి డబ్బు చెల్లించకపోవడంతో కూలీలు లోడింగ్ పనిని నిలిపివేశారు. ఈ విషయంపై తహసీల్దార్ రాజరాజేశ్వరితో జట్టు కూలీ నాయకులు కొప్పిశెట్టి వాసు తదితరులు చర్చలు జరిపారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ చెప్పారు. కూలి డబ్బులు ఇవ్వకుండా తమతో పని చేయించుకోవడాన్ని జట్టు కూలీలు వ్యతిరేకించారు. రెండు స్టాక్ పాయింట్లలో ఈ నెల 8న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఇసుక లోడింగ్ పనులను ప్రారంభించారు. 9వ తేదీన సరఫరా ప్రారంభమైంది. కపిలేశ్వరపురం స్టాక్ పాయింట్‌లో 32 మంది, తాతపూడి స్టాక్ పాయింట్‌లో 14 మంది మొత్తం 46 మంది జట్టు కూలీలు శ్రమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కూలి డబ్బు కూడా ఇవ్వకపోవడంపై కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బంగారు ఆభరణాల స్వాధీనం

తుని: రైలు ప్రయాణికుల నుంచి దొంగిలించిన బంగారు ఆభరణాలను రైల్వే పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకెళితే..తుని రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న యలమంచిలి, నర్సీపట్నం, తుని, అన్నవరం రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణం చేస్తూ తమ బంగారు ఆభరణాలను పోగొట్టుకున్నట్లు ప్రయాణికులు గతంలో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ ఏసీ కోచ్‌లలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కదలికలు గుర్తించారు. ఈ కేసులో నిందితుడు ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన సేనాపతుల మనిష్ అలియాస్ మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.12 లక్షల విలువ చేసే 190 గ్రాముల బంగారు ఆభరణాలు, మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని విజయవాడ రైల్వేకోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. బంగారు ఆభరణాలు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన జీఆర్పీ ఎస్సై అబ్దుల్‌మారూఫ్, హెచ్‌సీ పితాని శ్రీనివాసరావు, పీసీలు రామకోటి, శివ, సురేష్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్సై సతీష్, హెచ్‌సీ రవికుమార్, ఏఎస్ఐ గోవిందరాజును ఉన్నతాధికారులు అభినందించారు.

ఆగస్టులో భారత్ గౌరవ్ యాత్రకు రెండు రైళ్లు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ రాజా

రాజమహేంద్రవరం సిటీ: ఉత్తరాఖండ్ యాత్ర, జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్రలకు భారత్ గౌరవ్ యాత్ర స్పెషల్ రైళ్లను ఆగస్టు నెల 4,8 తేదీలలో నడపనున్నట్టు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వీఐపీ లాంజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రత్యేక యాత్ర రైళ్ల వివరాల బ్రోచర్లను స్టేషన్ మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఉత్తరాఖండ్ యాత్ర ఆగస్టు 8న ప్రారంభం కానుందన్నారు. ఈ రైలు మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నంలో బయలు దేరి సాయంత్రం 6 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుందన్నారు. ముందుగా రిజర్వేషన్ పొందిన యాత్రికులను ఎక్కించుకుని బయలుదేరుతుందన్నారు. సుమారు 300 మంది యాత్రికులతో భీమాల్, అల్మోరా, కౌసని, రాణిఖేత్ ప్రదేశాలను సందర్శించే ఈ రైలు యాత్ర 11 రోజులపాటు సాగుతుందన్నారు. ప్యాకేజీలో భాగంగా యాత్రికులకు అల్పాహారం, భోజన ఏర్పాట్లు, హోటళ్ల, అతిథిగృహాల్లో రాత్రి బస ఏర్పాట్లు, రైలు దిగి ఆయా ప్రాంతాల నుంచి పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం, రైలులో ఎస్కార్ట్, ప్రయాణ బీమా వంటివి కల్పిస్తామన్నారు. ఆగస్టు 4న జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర పేరుతో నడిచే ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుందన్నారు. ఈ రైలు అరుణాచలం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచ్చి, త్రివేండ్రం ప్రదేశాలకు వెళుతుందన్నారు. ఈ రైలులో స్లీపర్ క్లాస్, త్రీ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లు ఉంటాయన్నారు. ఈ రైలు యాత్ర 9 రోజులు సాగుతుందన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన యాత్రికులు విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి యాత్ర రైలు ఎక్కాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసీ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చునన్నారు. భారత్ గౌరవ్ యాత్ర రైళ్ల సమాచారం, ప్యాకేజీ, ఇతర పూర్తి వివరాలకు 92814 95848, 92810 30714 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఏడీబీ రోడ్డులో టోలిన్ లిక్విడ్ ట్యాంకర్ బోల్తా



ప్రమాదంలో బోల్తా పడిన ట్యాంకర్



ఘటనా స్థలం వద్ద అగ్నిమాపక శకటాలు

పెద్దాపురం: అత్యంత ప్రమాదకరమైన టోలిన్ లిక్విడ్ ట్యాంకర్ ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి బోల్తా పడి త్రుటిలో పెను ప్రమాదం తప్పిన ఘటన గురువారం ఉదయం పెద్దాపురం ఏడీబీ రోడ్డులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.... కాకినాడ పోర్టు నుంచి టోలిన్ లిక్విడ్‌తో హైదరాబాద్ తరలివెళుతున్న లారీ పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీస్, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై ప్రమాదంలో సుమారు 11 టన్నుల లిక్విడ్ గాలిలోకి కలిసి పోవడంతో ముందస్తు చర్యలు చేపట్టారు. అటుగా వాహన రాకపోకలు నిలిపివేసి మూడు అగ్నిమాపక శకటాలను ఘటనా స్థలానికి చేర్చారు. అప్పటికే ట్యాంకర్లో ఉన్న 11 టన్నుల లిక్విడ్‌ను ఎయిర్ ప్రెజర్ ద్వారా మరో ట్యాంకర్‌లోకి నింపారు. దీంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకుండా అప్రమత్తమైన పోలీస్, అగ్నిమాపక సిబ్బందిని పలువురు అభినందించారు.